# గ్రామాల్లో అభివృద్ధి పరుగులు



బస్వాపూర్ గ్రామ పాలకవర్గ సభ్యులతో ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, నాయకులు

- యువతకు ఉపాధి కోసం పరిశ్రమల ఏర్పాటు
- సీఎం కేసీఆర్‌ను లక్ష మెజార్టీతో గెలిపించాలి
- బీఆర్ఎస్ ప్రభుత్వానికి అండగా ఉండాలి
- ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి
- పలు గ్రామాల్లో నూతన పంచాయతీ భవనాల ప్రారంభోత్సవాలు

జగదేవ్‌పూర్, అక్టోబర్ 4 : బీఆర్ఎస్ హయాంలో పట్టణాలకు దీటుగా గ్రామాలు అభివృద్ధిలో పరుగులు పెడుతున్నాయని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని అనంతసాగర్, బస్వాపూర్, రాయవరం, ఇటిక్యాల, జంగంరెడ్డిపల్లె, రామచంద్రాపూర్, వట్టిపల్లె, చిన్నకిష్టాపూర్, ఎల్లయ్యగూడెం గ్రామాల్లో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాలను వారు ప్రారంభించారు. బస్వాపూర్‌లో చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ, జగదేవ్‌పూర్‌లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీసీ చైర్మన్ మాట్లాడుతూ తొమ్మిదేండ్ల బీఆర్ఎస్ పాలనలో గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. బడుగు బలహీన వర్గాలతోపాటు అన్నివర్గాలకు లబ్ధి చేకూరేలా సంక్షేమ పథకాలు రూపొందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. ముఖ్యంగా అన్నదాతల సంక్షేమం కోసం రైతుబంధు, రైతుబీమా, పంట రుణమాఫీ చేసిన మహానాయకుడు సీఎం కేసీఆర్ అని అన్నారు. దళితబంధు, బీసీ బంధు ద్వారా కులవృత్తులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. సమైక్య రాష్ట్రంలో గ్రామాలను పట్టించుకునే నాథుడే లేడని, తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్రం అభివృద్ధిలో దూసుకెళ్తుందన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం, పల్లె ప్రకృతి వనాలు వంటి అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అర్హులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని, ఇప్పటికే దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు.

**యువతకు ఉపాధి కోసం పరిశ్రమల ఏర్పాటు..**

మండలంలోని మునిగడప ప్రాంతంలో 412 ఎకరాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయనున్నట్లు ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఇందుకోసం భూసేకరణ ప్రక్రియ ప్రారంభమైందని, త్వరలోనే పారిశ్రామిక ప్రాంతంగా జగదేవ్‌పూర్ విరాజిల్లనుందన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుతో యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

**లక్ష మెజార్టీతో సీఎం కేసీఆర్‌ను గెలిపించుకుందాం..**

సీఎం కేసీఆర్ గజ్వేల్ నుంచి పోటీ చేయడం ఇక్కడి ప్రజల అదృష్టమని ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. గతంలో గజ్వేల్ ఎట్లుందో.. ఇప్పుడెట్లుందో ప్రజలు గమనించాలన్నారు. 50 ఏండ్ల అభివృద్ధిని సీఎం కేసీఆర్ ప్రజల కండ్ల ముందుంచారన్నారు. గజ్వేల్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. వచ్చే ఎన్నికల్లో గజ్వేల్ నుంచి పోటీ చేస్తున్న కేసీఆర్‌ను లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించి హ్యాట్రిక్ సీఎంను చేయాలన్నారు. మండల వ్యాప్తంగా సీఎం కేసీఆర్‌ను బలపరుస్తూ ఏకగ్రీవ తీర్మానాలు చేసి స్వచ్ఛందంగా ప్రజలు ముందుకురావాలని కోరారు.

**అభివృద్ధి పనులు ప్రారంభం, శంకుస్థాపనలు..**

జగదేవ్‌పూర్‌లో పీఏసీఎస్ కార్యాలయాన్ని ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి ప్రారంభించి చైర్మన్ ఇంద్రసేనారెడ్డిని కుర్చీలో కూర్చోబెట్టారు. దుకాణ సముదాయ భవనాలను ప్రారంభించారు. పీర్లపల్లి గ్రామంలో యాదవ సంఘం భవనం, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రానికి సర్పంచ్ యాదవరెడ్డి భూమిపూజ చేశారు. ఇటిక్యాలలో గ్రామ పంచాయతీ భవనం, పీహెచ్‌సీ సబ్‌సెంటర్, కురుమ సంఘం భవనాన్ని ప్రారంభించారు. నిర్మల్‌నగర్ గ్రామంలో కొత్త పంచాయతీ భవనాన్ని ప్రారంభించి మినీ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. తీగుల్ గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్త బీడ కనకయ్య ఇటీవల మృతి చెందగా వారి కుటుంబానికి రూ.2 లక్షల ప్రమాదబీమా చెక్కు అందజేశారు. అనంతసాగర్, వట్టిపల్లి, బస్వాపూర్, జంగంరెడ్డిపల్లె, చిన్నకిష్టాపూర్ గ్రామాల్లో నూతన పంచాయతీ భవనాలను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఎంపీపీ బాలేశంగౌడ్, జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ భగవాన్, ఆత్మకమిటీ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, సర్పంచులు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు నరేశ్, కావ్యాదర్గయ్య, రైతుబంధు సమితి కమిటీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, జగదేవ్‌పూర్ ఎంపీటీసీ కవితాశ్రీనివాస్‌రెడ్డి, గజ్వేల్ ఏఎంసీ వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, కొండపోచమ్మ ఆలయ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌గౌడ్, నాయకులు భూమయ్య, లక్ష్మణ్‌రాజ్, సంతోష్‌రెడ్డి, జశ్వంత్‌రెడ్డి, విజయ్‌కుమార్, గణేశ్, మహేశ్, మల్లేశం, నాగరాజు, ఎంపీడీవో శ్రీనివాస్‌వర్మ పాల్గొన్నారు.



క్రీడాకారులకు కిట్టు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

## క్రీడారంగానికి ప్రభుత్వం పెద్దపీట

తొగుట, అక్టోబర్ 4 : గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ క్రీడారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని ఎంపీపీ గంధారి లతానరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో యువకులకు క్రీడాసామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో యువతకు వివిధ క్రీడల్లో నైపుణ్యం ఉన్నప్పటికీ సరైన అవకాశాలు లేకపోవడంతో గుర్తింపు కోల్పోయారని తెలిపారు. గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు తెలంగాణ ప్రభుత్వం గ్రామాల్లో క్రీడామైదానాలు ఏర్పాటు చేసిందన్నారు. క్రీడా సామగ్రిని యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొమురయ్య, ఎంపీడీవో శ్రీధర్, సర్పంచులు మల్లయ్య, ఎల్లం, మంజుల, లీలాదేవి, నాయకులు మల్లారెడ్డి, కనకయ్య, శ్రీశైలం, స్వామి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## పట్టుదలతో చదివి లక్ష్యాన్ని చేరుకోవాలి



విద్యార్థి వారి తల్లిదండ్రులను సన్మానిస్తున్న ఏసీపీ రమేశ్

గజ్వేల్, అక్టోబర్ 4 : విద్యార్థులు పట్టుదలతో చదివితే అనుకున్న లక్ష్యానికి చేరుతారని ఏసీపీ రమేశ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని రిమ్మనగూడ సమీపంలోని సురభి దయాకర్‌రావు ఫార్మాసీ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఏసీపీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్ కోసం నిరంతరం కష్టపడి వారి భవిష్యత్ గురించి ఆలోచిస్తారని తెలిపారు. క్రమశిక్షణలోపాటు లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటరమణ పాల్గొన్నారు.

## యాదగిరికి కళారత్న అవార్డు

కొండపాక(కుకునూరుపల్లి), అక్టోబర్ 4 : తెలంగాణ సాంస్కృతిక కళాకారుడు, కొండపాక మండలం మర్పడగ గ్రామానికి చెందిన పూల్లూరు యాదగిరి కళారత్న అవార్డుకు ఎంపికయ్యారు. బుధవారం హైదరాబాద్‌లోని బహుజన సాహిత్య అకాడమీ కార్యాలయంలో అకాడమీ జాతీయ చైర్మన్ నల్ల రాధాకృష్ణ చేతుల మీదుగా యాదగిరి ప్రశంసాపత్రం అందుకున్నాడు. అక్టోబర్ 14న ఢిల్లీలో కళారత్న అవార్డుతో జ్ఞాపిక అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ తన సేవలను గుర్తించి కళారత్న అవార్డు ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు.

## పది రకాల వస్తువులు అందజేత

కొమురవెల్లి, అక్టోబర్ 4 : మండల కేంద్రంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు సబ్బులు, నూనె, డెటాల్ తదితర పది రకాల వస్తువులను బుధవారం గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ లతాకిష్టయ్య అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లోకేష్ పాల్గొన్నారు.

## కొమురవెల్లి మల్లన్న ఆలయానికి విరాళం

చేర్యాల, అక్టోబర్ 4 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయానికి హైదరాబాద్ నగరంలోని నాచారం ప్రాంతానికి చెందిన ఎర్రగొల్ల మల్లేశ్ రూ.లక్షా 25 వేల విలువైన లాకర్‌ను బుధవారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారితో పాటు అమ్మవార్ల ఆభరణాలు భద్రపర్చడానికి లాకర్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. లాకర్‌ను విరాళంగా అందజేసిన మల్లేశ్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులకు ఆలయ అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలు, ఆశీస్సులు అందజేశారు.

## బతుకమ్మ చీరల పంపిణీ షురూ



వర్గల్ : అంబార్‌పేటలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వర్గల్, అక్టోబర్ 4 : మండల వ్యాప్తంగా ఆయా గ్రామ పంచాయతీల్లో బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమం షురూ అయింది. బుధవారం మండల కేంద్రంలో జడ్పీటీసీ బాలమల్లుయాదవ్, మజీద్‌పల్లిలో ఎంపీపీ లతారమేశ్‌గౌడ్ మహిళలకు చీరలు అందజేశారు. బతుకమ్మ పండుగ పురస్కరించుకొని రకరకాల చీరలను ప్రభుత్వం ఏటా పంపిణీ చేస్తుండడంతో మహిళలు ఆనం దం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు 27 గ్రామ పంచాయతీలకు 13 వేల చీరలు వచ్చాయని ఎంపీడీవో మేరీస్వర్ణకుమారి తెలిపారు.

**సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ..**

రాయపోల్, అక్టోబర్ 4 : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని, స్వరాష్ట్రంలో బతుకమ్మ పండుగకు ప్రాధాన్యత కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని దౌల్తాబాద్ ఎంపీపీ సంధ్యారవీందర్, జడ్పీటీసీ రణం జ్యోతి, ఏఎంసీ చైర్మన్ లక్ష్మి అన్నారు. బుధవారం దౌల్తాబాద్‌లో మహిళలకు ప్రభుత్వం సరఫరా చేసిన బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో బతుకమ్మ పండుగకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభించిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ యాదగిరి, ఎంపీటీసీ వనితావేణుగోపాల్ పాల్గొన్నారు.



రాయపోల్ : మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

## సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం



రాయపోల్ : బాధిత కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

రాయపోల్, అక్టోబర్ 4 : నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ వరంలా మారిందని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఇప్ప లక్ష్మి, జడ్పీటీసీ లింగాయపల్లి యాదగిరి అన్నారు. మండలంలోని తిమ్మక్కపల్లి గ్రామానికి చెందిన జనార్దన్‌కు మంజూరైన రూ.30 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలకు తెలంగాణ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దయాకర్, రాజిరెడ్డి, పద్మారెడ్డి, ఐలయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

**సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత..**

కొమురవెల్లి, అక్టోబర్ 4 : మండలంలోని మర్రిముచ్చాలకు చెందిన తురాయి కనకయ్యకు మంజూరైన రూ.10 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తలారి కిషన్ అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు నర్సింగరావు, నాయకులు పాల్గొన్నారు.

## బడ్జెట్‌లో ఉపాధి నిధులు తగ్గిస్తున్న కేంద్రం

**డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి స్వామి**

గజ్వేల్, అక్టోబర్ 4 : దేశంలో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీ నిధులకు కోత విధిస్తూ ఆ చట్టాన్ని పూర్తిగా ఎత్తివేసేందుకు చూస్తున్నదని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఎగొండ స్వామి అన్నారు. గత రెండు రోజులుగా ఢిల్లీలో 18 దేశాలకు చెందిన సామాజిక ఉద్యమ కార్యకర్తలు, ప్రతినిధుల సభలో పాల్గొన్న సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడారు. పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టానికి రక్షణ లేదన్నారు. ఉపాధి హామీ కూలీలకు పనులు చూపకుండా హక్కులను కేంద్రం కాలరాస్తున్నదన్నారు. ఆన్‌లైన్ హాజరు, ఆధార్ సీడింగ్ పనులను డ్రోన్ కెమెరాలతో నిఘా పెడుతూ అడుగడుగునా ఉపాధి హామీ చట్టాన్ని ఉల్లఘిస్తున్నదన్నారు. ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

## నేడు మల్లేశంపల్లికి ఎంపీ రాక

రాయపోల్, అక్టోంబర్ 4 : దౌల్తాబాద్ మండలం మల్లేశంపల్లి గ్రామంలో నేడు దుబ్బాక నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి పర్యటించనున్నట్లు బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకుడు, సర్పంచ్ దార సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం ఉదయం 9 గంటలకు మల్లేశంపల్లి చౌరస్తాలోని గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలను ఎంపీ ఆవిష్కరించనున్నట్లు తెలిపారు.